RNI NO.TELTEL/2022/83842

PRABHATA GAMANAM

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

వరంగల్ | సంచిక 307 | సంపుటి 4 | గురువారం | 13-08-2026 | పేజీలు 4 | వెల 3/-

## 11.56 లక్షల ఇళ్లు కేటాయించండి

- కేంద్ర మంత్రి చౌహాన్‌కు మంత్రి పొంగులేటి వినతి
- తెలంగాణలో పర్యటించాల్సిందిగా కేంద్ర మంత్రికి ఆహ్వానం
- సానుకూలంగా స్పందించిన శివరాజ్ సింగ్

న్యూఢిల్లీ, ప్రభాతగమనం, ఆగస్టు 12 :

ప్రధానమంత్రి ఆవాస్ యోజన–గ్రామీణ్ (పీఎంఏవై– జి 2.0) కింద రాష్ట్రానికి సమగ్ర ప్రాతిపదికన ఒకేసారి 11,56,915 ఇళ్లను కేటాయించాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దిల్లీలో కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను పొంగులేటి బుధవారం కలిసి ఈమేరకు వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాసిన లేఖను ఈ సందర్భంగా గుర్తు చేసిన ఆయన రాష్ట్రంలో ఇళ్ల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.



నీటివాటాలపై

## రాజీపడే ప్రసక్తే లేదు

- వాటాల్లో బిఆర్ఎస్ వల్లే తెలంగాణకు నష్టం
- అసత్యాలను ప్రచారం చేయడం అలవాటు చేసుకున్న కెటిఆర్
- మీడియా సమావేశంలో మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్,ప్రభాతగమనం,ఆగస్టు12:

తెలంగాణ నీటి వాటా విషయంలో ఎక్కడా రాజీపడబోమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. నీటి వాటాల్లో తెలంగాణకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నష్టం చేసిందని విమర్శించారు. బుధవారం గాంధీ భవ న్‌లో ఆయన మాట్లాడుతూ.. జీఆర్ ఎంబీ సమావేశానికి హాజరవుతామని తెలిపారు. నీటీ వాటాపై బలంగా కొట్లాడుతామని పేర్కొన్నారు. అసత్యాలతో ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారంటూ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై మండిపడ్డారు. కేసీఆర్ ఫాం హౌస్‌లో పండిన వరికి వచ్చిన ధర ఎంతో చెప్పాలంటూ కేటీఆర్‌ను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు డిమాండ్ చేశారు. తాము కోటిన్నర రూపాయిలకు ఇచ్చిన భూమిని బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 90 లక్షలకే ఇచ్చిందని గుర్తు చేశారు. నిబంధనల మేరకే భూ కేటాయింపులు జరిగాయని ఆయన వివరించారు. 5 ఎకరాల భూమిని రూ.7.5 కోట్లకు ఇచ్చామని చెప్పారు. కేటీఆర్ చెబుతున్న రూ. 200 కోట్లు ఎక్కడివో చెప్పాలని నిలదీశారు. హిల్ట్ పాలసీ వల్ల హైదరాబాద్ ప్రజలకు మేలు జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పారిశ్రామిక వేత్తలను భయపెట్టడం కేటీఆర్‌కు మంచిది కాదని అన్నారు. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడం సరైనది కాదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడికి హితవు పలికారు. రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎకరా భూమిని రూ.90 లక్షలకే కేటాయించారని, తమ ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఎకరా కోటిన్నర లెక్కన కేటాయించినట్లు స్పష్టం చేశారు. ఐదు ఎకరాల భూమిని రూ.7.5 కోట్లకు ఇచ్చామని చెప్పిన శ్రీధర్‌బాబు.. కేటీఆర్ చెబుతున్న రూ.200 కోట్ల లెక్కలు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. అసత్య ప్రచారంతో ప్రజలను పక్కదోవ పట్టించొద్దని కేటీఆర్‌కు మంత్రి సూచించారు.

మిల్లర్ల నుంచి బకాయిలు

# వసూలు చేయాల్సిందే..

- డిఫాల్టర్ మిల్లులపై కఠిన చర్యలు..
- స్వాధీనం చేసుకునే అంశాన్ని పరిశీలించాలి
- మహిళా సంఘాలకు మిల్లింగ్ బాధ్యతలు..
- ఐదు నియోజకవర్గాల్లో గోడౌన్ల నిర్మాణానికి పైలట్ ప్రాజెక్టు
- సివిల్ సప్లయిస్‌పై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




హైదరాబాద్ ఆగస్టు 12(ప్రభాత గమనం):

మిల్లర్లు బకాయి పడిన ధాన్యం విలువకు సంబంధించిన మొత్తాన్ని వసూలు చేయాల్సిందేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వ్యాపార దృక్పథంతో మిల్లులు నడిపే వారితో సానుకూలంగా ఉంటామని ఉద్దేశపూర్వకంగా ఎగవేతలకు ప్రయత్నించే వారితో కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి పౌరసరఫరాల శాఖపై ఆ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డితో కలిసి ఎంసిఆర్హెచ్ఆర్డి లో సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం వేలకోట్ల రూపాయల బకాయిలకు అవకాశం ఇచ్చి, తిరిగి ఆ తప్పిదాన్ని ప్రస్తుత ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు.ఇప్పటికే బకాయిల వసూలులో కొంత పురోగతి ఉందని అయితే ప్రతి ధాన్యం గింజకు సంబంధించి బకాయిలను వసూలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. బకాయిల వసూలుకు సంబంధించి విధి విధానాలను రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. విధివిధానాల రూపకల్పన పూర్తయిన తర్వాత ఆ నివేదికను మంత్రివర్గ ఉపసంఘానికి సమర్పించాలని సూచించారు. మంత్రివర్గ ఉప సంఘం పరిశీలన అనంతరం ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. మొండి బకాయి దారులుగా మారిన మిల్లర్లకు కేటాయించే దాన్యాన్ని మహిళా సంఘాలకు కేటాయించి మిల్లింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తామని చెప్పారు. ప్రతి సీజన్లో ధాన్యం నిల్వకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఇప్పటినుంచే తగు కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.ధాన్యం భారీగా వచ్చే నలగొండ, సూర్యపేట, నిజామాబాద్, పెద్దపల్లి కామారెడ్డి జిల్లాలో సైలో బ్యాగుల ఏర్పాటుకు పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో సైలో బ్యాగ్ నిర్మాణాలకు నియోజకవర్గానికి 50 నుంచి 100 ఎకరాల భూమిని కేటాయిస్తామని ముఖ్యమంత్రి తెలియజేశారు. వీటి నిర్మాణానికి సంబంధించి రెవెన్యూ పౌరసపరాలు మహిళా సంక్షేమ శాఖల మంత్రులతో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. వివిజిరాంజీలో ప్లాట్ఫాముల నిర్మాణానికి అవకాశం ఉన్నందున విశాలమైన ప్లాట్ ఫామ్ లు నిర్మించి జర్మన్ టెంట్లతో ధాన్యం నిల్వకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. మండల గ్రామస్థాయిలో ఉన్న ప్రైవేటు గోదాము లు దాన్య నిలువకు ఉపయోగపడే కల్యాణ మండపాలు పాత థి యేటర్లు ఇతర షెడ్లను ముందుగానే గుర్తించి ధాన్య నిల్వకు లీజు కు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్షలో సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శేషాద్రి, సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, సౌత్ ఇండియా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తుడి దేవేందర్ రెడ్డి ఉన్నారు.

## 'గ్రేటర్'లో ఏం జరుగుతోంది?



- రూ.40 వేల వ్యవహారంపై ఫిర్యాదు..
- ఫేక్ రసీదు ఆరోపణలు
- విచారణ కమిటీ నివేదిక ఏమైంది?
- బదిలీతోనే వ్యవహారం ముగిసిందా?

వరంగల్ క్రైమ్ బ్యూరో, ఆగస్టు 12 (ప్రభాత గమనం):

గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థలో ఓ ఉద్యోగిపై వచ్చిన ఆరోపణల వ్యవహారం ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఓ ఇంటి యజమాని నుంచి రూ.40 వేలు తీసుకున్నారనే ఆరోపణతో పాటు, అందుకు సంబంధించి ఫేక్ రసీదు జారీ చేశారనే ఫిర్యాదు వచ్చినట్లు సమాచారం. ఈ ఫిర్యాదుపై విచారణకు ఆదేశించినట్లు తెలుస్తున్నా.. విచారణ కమిటీ ఏం తేల్చింది? నివేదిక ఏమైంది? దాని ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే అంశాలపై స్పష్టత లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇదిలా ఉండగా, కాశిబుగ్గ సర్కిల్–1 డిప్యూటీ కమిషనర్ కార్యాలయం నుంచి ఈ నెల 6న జారీ అయిన అధికారిక ఉత్తర్వుల్లో.. కాశిబుగ్గ సర్కిల్–1లో ఇన్‌చార్జ్ బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న సదరు ఉద్యోగిపై కొన్ని ఆరోపణలు, ఫిర్యాదులు అందినట్లు పేర్కొంటూ ఆయన సేవలను చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్‌కు అప్పగించి, డంపింగ్ యార్డులో తదుపరి పోస్టింగ్ కోసం పంపినట్లు పేర్కొన్నట్లు సమాచారం.

### విచారణ నివేదిక ఏమైంది?

ఉద్యోగిపై ఆరోపణలు వచ్చినప్పుడు వాటి వాస్తవాలను తేల్చేందుకు విచారణ చేపట్టడం సహజం. ఆరోపణలు నిజమని తేలితే నిబంధనల ప్రకారం చర్యలు, నిరాధారమని తేలితే ఫిర్యాదు వెనుక వాస్తవాలను వెల్లడించాల్సి ఉంటుంది. అయితే ఈ వ్యవహారంలో విచారణ కమిటీ నివేదిక ఏమి చెప్పిందనే విషయం మాత్రం బయటకు రాలేదు. రూ.40 వేలు తీసుకున్నారనే ఆరోపణ నిజమా? ఫేక్ రసీదు జారీ చేశారనే ఆరోపణకు ఆధారాలున్నాయా? రసీదు ఏ పేరుతో జారీ అయింది? సంబంధిత రికార్డులను పరిశీలించారా? ఫిర్యాదుదారుడిని, ఉద్యోగిని విచారించారా? కమిటీ ఏం తేల్చింది? అనే ప్రశ్నలకు అధికారిక సమాధానం రావాల్సి ఉంది.

### ఆరోపణలు నిజమైతే చర్యలేవి?

ఒకవేళ నగదు తీసుకున్నారనే ఆరోపణ, ఫేక్ రసీదు జారీ చేశారనే ఆరోపణలు విచారణలో నిజమని తేలితే కేవలం మరో విభాగానికి పంపించడం సరిపోతుందా? శాఖాపరమైన చర్యలు ఎందుకు తీసుకోలేదు? సస్పెన్షన్ వంటి చర్యలు ఎందుకు చేపట్టలేదు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మరోవైపు ఆరోపణలు నిరాధారమని విచారణలో తేలితే ఆ విషయాన్ని అధికారికంగా ఎందుకు వెల్లడించలేదనే ప్రశ్న కూడా ఉంది. ఫిర్యాదు తప్పుదోవ పట్టించేలా ఉంటే ఫిర్యాదుదారుడిపై చర్యలు తీసుకునే అవకాశం కూడా ఉంది. ఈ రెండు అంశాల్లో ఏది నిజమో అధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.

### డంపింగ్ యార్డ్ కు పంపడం చర్యేనా?

సదరు ఉద్యోగిని చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్‌కు అప్పగించి డంపింగ్ యార్డులో తదుపరి పోస్టింగ్ ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు సమాచారం. ఇది క్రమశిక్షణ చర్యా? లేక సాధారణ పరిపాలనా బదిలీనా? అనే విషయం కూడా స్పష్టత కావాల్సి ఉంది. ఆరోపణలపై పూర్తి విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించకుండా కేవలం పోస్టింగ్ మార్చడం ద్వారా సమస్య పరిష్కారం కాదని ఉద్యోగ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

### గత వ్యవహారాలపై కూడా చర్చ

గతంలో ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మరో ఉద్యోగికి సంబంధించిన లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌ను ఉపయోగించి ఫైల్ మూవ్‌మెంట్ చేసిన ఘటనపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారని, 2021లో చీటింగ్ కేసు కూడా నమోదైందని ఉద్యోగ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ఆ ఘటనకు ప్రస్తుత ఆరోపణలకు ప్రత్యక్ష సంబంధం ఉందా లేదా అనేది అధికారిక రికార్డుల ఆధారంగా మాత్రమే నిర్ధారించాల్సి ఉంటుంది. అయితే గతంలో ఇలాంటి అంశాల్లో చర్యలు తీసుకున్న అధికారులు.. ప్రస్తుత ఆరోపణల విషయంలో ఏ విధానాన్ని అనుసరిస్తున్నారనే ప్రశ్న ఉద్యోగ వర్గాల్లో వినిపిస్తోంది.

### 'అదృశ్య హస్తం' ఉందా?

సదరు ఉద్యోగికి ఉన్నతస్థాయి అండదండలు ఉన్నాయా? రాజకీయ జోక్యం ఏమైనా జరిగిందా? కొందరు అధికారులు వ్యవహారాన్ని ప్రభావితం చేస్తున్నారా? అనే అనుమానాలు ఉద్యోగ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. అయితే ఇవన్నీ ప్రస్తుతం వినిపిస్తున్న ఆరోపణలు, అనుమానాలు మాత్రమే. వాటికి అధికారిక ధ్రువీకరణ లేదు. కాశిబుగ్గ సర్కిల్‌లో కొందరు అధికారులు చాలాకాలంగా ఒకే స్థానంలో కొనసాగుతున్నారనే చర్చ కూడా ఉంది. ఈ అంశాన్ని కూడా అధికారిక రికార్డుల ఆధారంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

### కమిషనర్ స్పష్టత ఇవ్వాల్సిన అంశాలు

ఈ వ్యవహారంపై జీడబ్ల్యూఎంసీ కమిషనర్ సమగ్రంగా స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. రూ.40 వేల ఫిర్యాదు నిజమేనా? ఫేక్ రసీదు జారీ చేసినట్లు ఆధారాలు లభించాయా? విచారణ కమిటీ ఏర్పాటు చేశారా? నివేదికలో ఏం తేలింది? నివేదిక ఆధారంగా ఏ చర్యలు తీసుకున్నారు? ఆరోపణలు నిజమైతే శాఖాపరమైన చర్యలు ఎందుకు తీసుకోలేదు? నిరాధారమైతే ఫిర్యాదుదారుడిపై ఎందుకు చర్యలు తీసుకోలేదు? డంపింగ్ యార్డుకు పంపడం శిక్షా చర్యా లేదా సాధారణ బదిలీనా? వంటి ప్రశ్నలకు సమాధానాలు వెల్లడించాల్సి ఉంది.

### పారదర్శక విచారణతోనే అనుమానాలకు తెర

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల నుంచి వసూలు చేసే ప్రతి రూపాయికి, జారీ చేసే ప్రతి రసీదుకు పారదర్శకమైన రికార్డు ఉండాలి. ఉద్యోగులపై వచ్చే ఫిర్యాదుల విషయంలోనూ నిష్పక్షపాతంగా విచారణ జరగాలి. ఫిర్యాదు నిజమైతే చర్యలు తీసుకోవాలి.. నిరాధారమైతే ఆ విషయాన్ని స్పష్టం చేయాలి. రూ.40 వేల వ్యవహారంలో అసలు నిజానిజాలు ఏమిటి? ఫేక్ రసీదు ఆరోపణలో వాస్తవం ఎంత? విచారణ కమిటీ ఏం తేల్చింది? సదరు ఉద్యోగికి ఎందుకు మరో పోస్టింగ్ ఇచ్చారు? అనే అంశాలను జీడబ్ల్యూఎంసీ ఉన్నతాధికారులు బహిర్గతం చేస్తేనే ఈ వ్యవహారంపై నెలకొన్న అనుమానాలకు తెరపడే అవకాశం ఉంది. లేదంటే 'ఎవరిని కాపాడుతున్నారు?' అనే ప్రశ్న మరింత బలపడే పరిస్థితి ఏర్పడుతుంది.

78 మంది ఖైదీలు

## ఎస్సెస్సీ ఉత్తీర్ణత

- తెలంగాణలో మొదటిసారి
- ప్రత్యేక రిమిషన్ ప్రకటించిన జైళ్ల శాఖ డీజీ డా.సౌమ్య మిశ్రా

హైదరాబాద్, ప్రభాతగమనం, ఆగస్టు 12:

ఖైదీల విద్య, పునరావాసం మరియు సమాజంలో తిరిగి గౌరవప్రదంగా జీవించేలా చేయడంలో భాగంగా తెలంగాణ జైళ్ల శాఖ చేపడుతున్న నిరంతర కార్యక్రమాల్లో మరో కీలక ముందడుగు పడింది. ఖైదీలు తమ విద్యను కొనసాగించి ఎస్సెస్సీ పూర్తి చేసుకునే అవకాశం కల్పించేందుకు తెలంగాణ జైళ్ల శాఖ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ ఐఓఎస్) తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. అనంతరం సెంట్రల్ ప్రిజన్, చర్లపల్లి; సెంట్రల్ ప్రిజన్, నిజామాబాద్; స్పెషల్ ప్రిజన్ ఫర్ ఉమెన్, హైదరాబాద్ నుంచి మొత్తం 108 మంది ఖైదీలు ఎస్సెస్సీ (10వ తరగతి) కార్యక్రమంలో నమోదు చేసుకున్నారు. ఖైదీల చదువుకు అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులను కేటాయించడంతో పాటు, అవసరమైన చోట అదనంగా ప్రైవేట్ ఉపాధ్యాయులను కూడా నియమించారు. వీరి వేతనాలను తెలంగాణ జైళ్ల శాఖ భరించింది. సంబంధిత జైళ్లలోని అధికారులు, ఉపాధ్యాయులు విద్యార్థుల చదువును నిరంతరం పర్యవేక్షిస్తూ, మార్గనిర్దేశం చేశారు. ఒక సంవత్సరం పాటు క్రమబద్ధమైన విద్యా ప్రణాళికలో భాగంగా రెగ్యులర్ తరగతులు, మాక్ టెస్టులు, ప్రీ–బోర్డ్ పరీక్షలు నిర్వహించి ఎన్ ఐఓఎస్ ఎస్సెస్సీ పరీక్షలకు ఖైదీలను సిద్ధం చేశారు. ఈ నిరంతర కృషి ఫలితంగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో 78 మంది ఖైదీలు ఎస్సెస్సీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. సెంట్రల్ ప్రిజన్, చర్లపల్లి – 56 మంది , సెంట్రల్ ప్రిజ న్, నిజామాబాద్ – 15 మంది, స్పెషల్ ప్రిజన్ ఫర్‌ఉమెన్, హైదరాబాద్ – 7 మంది ఖైదీలకు సులభంగా అర్థమయ్యేలా, భవిష్యత్తులో ఉపాధి మరియు జీవనోపాధికి ఉపయోగపడే విధంగా పాఠ్యాంశాలను ఎంపిక చేశారు. ఇందులో డేటా ఎంట్రీ ఆపరేటర్, నైపుణ్యాలకు సంబంధించిన అంశాలను కూడా చేర్చారు. తెలంగాణ జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ అండ్ ఎవెంపీ; కరెక్షనల్ సర్వీసెస్ డా. సౌమ్య మిశ్రా, విజయవంతంగా ఎస్సెస్సీ ఉత్తీర్ణత సాధించిన ఖైదీలకు ధ్రువపత్రాలను అందజేసి వారిని అభినందించా రు. ఈ ఫలితాలను వారి విద్యా ప్రయాణం, స్వీయాభివృద్ధి మరియు పునరావా సంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా ఆమె అభివర్ణించారు. ఖైదీలు చూపిన పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర శ్రమ, ఆత్మవిశ్వాసం మరియు ప్రతికూల పరిస్థితులను అధిగమించాలనే సంకల్పాన్ని డీజీ ప్రత్యేకంగా ప్రశంసించారు.



# అధ్వానంగా ఆశ్రమ పాఠశాలలు

- విద్యార్థులను ఇళ్లకు పంపుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి

మహబూబాబాద్ ఆగస్టు 12(ప్రభాత గమనం):




మానుకోట జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల పరిస్థితులు అధ్వానంగా మారాయని, విద్యార్థుల భవిష్యత్తుతో అధికారులు చెలగాటమాడుతున్నారని లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్ నాయక్ ఆరోపించారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, భోజన వసతులు, మెనూ అమలు, పేరెంట్స్ కమిటీల ఏర్పాటు తదితర అంశాలపై రాష్ట్ర స్థాయి అధికారులతో సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. రెడ్యాల గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలను బోడ రమేష్ నాయక్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో 360 మంది విద్యార్థులకుగాను కేవలం 120 మంది మాత్రమే హాజరైనట్లు గుర్తించామని తెలిపారు. అదేవిధంగా రెండు రోజుల క్రితం సీతానగారం ఆశ్రమ బాలుర పాఠశాలలో 380 మంది విద్యార్థులకు గాను కేవలం 60 మంది మాత్రమే పాఠశాలలో ఉన్నారని ఆరోపించారు. కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం విద్యార్థులను వారి ఇళ్లకు పంపిస్తున్నారని, మైనర్లైన విద్యార్థులు పాఠశాలలో లేకపోయినా తల్లిదండ్రులు లేదా సంరక్షకుల సంతకాలతో సర్టిఫికెట్లు జారీ చేసే అవకాశం ఉన్నప్పటికీ విద్యార్థులను ఇళ్లకు పంపించడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ పరిస్థితి గత వారం రోజులుగా కొనసాగుతోందని పేర్కొన్నారు. విద్యార్థులు పాఠశాలలో లేకపోవడంతో ఆ రోజులకు సంబంధించిన మెనూ ఖర్చులు మిగిలిపోతాయని, వాటిని అధికారులు, హెడ్మాస్టర్లు, హాస్టల్ వార్డెన్లు వాటాలుగా పంచుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయని బోడ రమేష్ నాయక్ అన్నారు. అయితే ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని డిమాండ్ చేశారు. అనేక ఆశ్రమ పాఠశాలల్లో మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని, పాఠశాలల్లో మెనూ బోర్డులు కూడా కనిపించడం లేదని ఆరోపించారు. రెడ్యాల, సీతానగరం పాఠశాలలకే పరిమితం కాకుండా జిల్లాలోని సుమారు 35 ఆశ్రమ పాఠశాలలు, స్పెషల్ హాస్టళ్లలోనూ ఇలాంటి పరిస్థితులు ఉన్నాయని అన్నారు. ఇప్పటివరకు ఏ ఒక్క పాఠశాలలోనూ పేరెంట్స్ కమిటీలను ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం గిరిజన విద్యార్థుల కోసం నిధులు కేటాయిస్తున్నప్పటికీ, వాటి ప్రయోజనం విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందడం లేదని బోడ రమేష్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల విద్య, భవిష్యత్తు కంటే ఇతర ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్, కార్యదర్శులు, ఐటీడీఏ పీవోలు వెంటనే స్పందించి మానుకోట జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలపై రాష్ట్ర స్థాయి అధికారులతో పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా కమిటీ తరపున బోడ రమేష్ నాయక్ డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠశాలల్లో విద్య, వసతి, భోజన సౌకర్యాలను మెరుగుపరచాలని కోరారు.




## విద్యారంగ సమస్యలపై సమరశీల పోరాటాలు

- ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి శరత్
- ఎఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవం

కేసముద్రం ఆగస్టు 12(ప్రభాత గమనం):

భారత దేశ స్వాతంత్ర్యమే లక్ష్యంగా 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్ లోని లక్నలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) ఆవిర్భావించి దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఎంతో మంది యువకిషోరాలను బలిదానం చేసిన ఏకైక విద్యార్థి సంఘమని, ప్రభుత్వ విద్య పరిరక్షణకై, విద్యారంగ సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి శరత్ పిలుపునిచ్చారు. బుధవారం కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంలో ఎఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. దానిలో భాగంగా అంబేద్కర్ సెంటర్ లోని ఎఐఎస్ఎఫ్ గద్దె వద్ద ఎఐఎస్ఎఫ్ శ్వేత అరుణ పతాకాన్ని ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి శరత్ ఎగురవేశారు. అనంతరం శరత్ మాట్లాడుతూ భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని బ్రిటిష్ సామ్రాజ్యవాదుల చెర నుంచి మాతృభూమి విముక్తికై 1936 ఆగస్టు 12న ఎఐఎస్ఎఫ్ ఆవిర్భావించి దేశ స్వాతంత్రోద్యమంలో అసమాన పోరాటాలు నిర్వహించి, ఎంతో మంది విద్యార్థులను త్యాగం చేసిందని కొనియాడారు. పోరాటాలు, త్యాగాలే ధ్యేయంగా ఏర్పాటైన ఈ విద్యార్థి సంఘం స్వాతంత్ర్య అనంతరం ప్రభుత్వ విద్యా పరిరక్షణకై, శాస్త్రీయ విద్య, కామన్ విద్యావిధానం అమలుపై నిరంతరం పోరాటాలు సాగిస్తూ 90 సంవత్సరాలుగా విద్యార్థుల శ్రేయస్సు కోసం అశేష త్యాగాలు చేస్తూ ఆవిర్భావం నాటి నుంచి నేటివరకు గల్లి నుండి ఢిల్లీ వరకు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై దేశ వ్యాపితంగా ఉద్యమాలు నిర్వహిస్తున్న సంఘం ఎఐఎస్ఎఫ్ అని అన్నారు. ఎంతో మంది రాజకీయ వేత్తలను, మేధావులను అందించిన చరిత్ర ఎఐఎస్ఎఫ్ కు ఉన్నదని అన్నారు. 90 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఎఐఎస్ఎఫ్ ఉద్యమ స్ఫూర్తితో నేటి పాలకులు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై, ప్రభుత్వ విద్య పరిరక్షణకై విద్యార్థులు పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు ముద్రకోల అనిల్, సింగిని రణధీర్, పానుగంటి ప్రేమ్ కుమార్, బోశెట్టి పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పోరాటమే బీమా నాయక్ బలం

- భవిష్యత్ రాజకీయాలపై ఆసక్తికర చర్చ

మహబూబాబాద్ ఆగస్టు 12(ప్రభాత గమనం):

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రజలు, గిరిజనులు, అణగారిన వర్గాల సమస్యలపై నిరంతరం గళం వినిపిస్తూ తనదైన శైలిలో ముందుకు సాగుతున్న ఎల్హెచ్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బీమా నాయక్ ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. ఎలాంటి అధికార పదవి అండ లేకుండా, ఆర్థిక బలం లేకపోయినా సమస్యను తనదిగా భావించి ప్రజల తరఫున పోరాడటమే తన రాజకీయ ప్రస్థానానికి పునాదిగా మలుచుకున్నారు. అధికారం కోసం కాకుండా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయడమే తన లక్ష్యమనే భావనతో ముందుకు సాగుతున్న బీమా నాయక్, జిల్లాలోని అనేక ప్రాంతాల్లో తన ఉద్యమ స్వరాన్ని బలంగా వినిపించారు. అధికారులను ప్రశ్నించాల్సిన సందర్భంలో ప్రశ్నించడం, బాధితుల పక్షాన నిలబడాల్సిన సమయంలో అండగా నిలవడం ఆయనకు ప్రజల్లో ప్రత్యేకమైన గుర్తింపును తీసుకొచ్చింది. పదవి లేకపోయినా ప్రజల మధ్య.. ఆస్తి లేకపోయినా పోరాటమే ఆస్తిగా.. అనే విధంగా సాగుతున్న ఆయన ప్రస్థానం భవిష్యత్ రాజకీయాలపై ఆసక్తిని రేకెత్తిస్తోంది. సాధారణ కార్యకర్తగా ప్రారంభమైన ప్రయాణం రాష్ట్ర స్థాయి నాయకత్వానికి చేరుకోవడం, అక్కడి నుంచి ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేయడం ఆయన రాజకీయ ఎదుగుదలకు నిదర్శనంగా పలువురు భావిస్తున్నారు. ఇప్పటికే ప్రజా ఉద్యమాల ద్వారా తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్న బీమా నాయక్, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా రాజకీయ అరంగేట్రం చేయనున్నారనే చర్చ జిల్లాలో ఊపందుకుంటోంది. అయితే ఈ నిర్ణయంపై ఆయన అధికారికంగా ఎలాంటి ప్రకటన చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. రాజకీయాల్లో డబ్బు, పదవి, పలుకుబడి కంటే ప్రజల్లో సంపాదించుకున్న విశ్వాసమే అసలైన బలం అని నమ్ముతున్న బీమా నాయక్కు రాబోయే రోజులు ఎలాంటి రాజకీయ అవకాశాలను తీసుకొస్తాయన్నది వేచి చూడాల్సిందే. ప్రజా పోరాటాల నుంచి ఎన్నికల రాజకీయాల వైపు అడుగులు వేస్తే.. బీమా నాయక్ ప్రస్థానంలో అది కీలక మలుపుగా మారే అవకాశం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.



## ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- పీఆర్సీ ప్రకటించాలని, పెండింగ్ డీఏలను విడుదల చేయాలని డిమాండ్
- గార్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట యూఎస్పీసీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన

గార్ల,ఆగస్టు 12 (ప్రభాత గమనం):



ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసీ) స్టీరింగ్ కమిటీ అధ్యక్షుడు పాపావత్ యాదగిరి నాయక్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో తలపెట్టిన దశలవారీ ఉద్యమంలో భాగంగా బుధవారం గార్ల మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలపడం జరిగింది.ఈ సందర్భంగా పాపావత్ యాదగిరి నాయక్ మాట్లాడుతూ... నూతన వేతన సవరణను వెంటనే ప్రకటించడంతో పాటు, బకాయి పడిన ఆరు కరువు భత్యాలను తక్షణమే మంజూరు చేయాలని కోరారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయులను, మండల వనరుల కేంద్రాల్లో పనిచేస్తున్న అవుట్సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు దశలవారీ పోరాటాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు.అనంతరం తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మండల తహసీల్దార్ శారదకు అందజేశారు.ఈ కార్యక్రమంలో యూఎస్పీసీ స్టీరింగ్ కమిటీ నాయకులు బాలాజీ నాయక్, మాచర్ల సుందర్ కుమార్, షరీఫ్, జబ్బ వీరస్వామి, కబ్బాకుల వెంకన్నతో పాటు ఉపాధ్యాయులు సంతు, రామనాధం, వెంకట్రెడ్డి, రాజశేఖర్, ప్రవీణ్కుమార్, తోట రమేష్, బాల్య, కన్నయ్య, వెంకట్రావు, శ్రీను, అనిల్, కిరణ్, పార్వతి, విజయ, సీతారాములు, రవీందర్ ప్రసాద్, లోకేష్, భావ్సింగ్, రమేష్, మధు, లచ్చిరాం, ప్రసాద్, కిషన్, రవీందర్, శోభన్బాబు, వజ్రం నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



## కల్వాల జెడ్పీహెచ్ఎస్ లో ఘనంగా తీజ్ పండుగ

కేసముద్రం ఆగస్టు 12(ప్రభాత గమనం):

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కల్వలలో గిరిజన సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే తీజ్ పండుగను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండారు నరేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంటా సంజీవరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతి ఆరాధన, పంటల సమృద్ధి, సుఖసంతోషాలకు ప్రతీకగా తీజ్ పండుగను నిర్వహిస్తారని ఈ సందర్భంగా వివరించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి సాంస్కృతిక కార్యక్రమాలు, తీజ్ నృత్యాలతో అలరించారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ముఖ్యఅతిథి గంటా సంజీవరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుజాత రామ చందర్, అమ్మ ఆదర్శ కమిటీ లింగాల కవిత పిచ్చయ్య, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కల్లం వీరారెడ్డి, గండి శీను, బాలకృష్ణారెడ్డి ఉపాధ్యాయులు,ఆర్.యాకాంబ్రం,బి. సత్యనారాయణ,టి.సదానందం,వి. నాగేందర్ ,ఆర్. బిక్షపతి,ఎం. యాకంబ్రం, ఫిజికల్ డైరెక్టర్ కొప్పుల శంకర్, ఎండి జుబేర్ అలీ , కే. పార్వతి,వి రాజేంద్ర చారి, రాము, కే. రాములు, బాల శివ రెడ్డి , నాగరాజు, ఏ లింగయ్య,సిఆర్పి ఉదయ్, సునీల్ , రాధా, లచ్చమ్మ విద్యార్థిని,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## జీఆర్ఎంబీ ఎజెండాపై తెలంగాణ అభ్యంతరం

- ఎజెండాలో గత అంశాలను తొలగించాలని డిమాండ్
- సవరించిన ఎజెండా విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి
- ఈనెల 18న జీఆర్ఎంబీ సమావేశం

హైదరాబాద్, ప్రభాతగమనం, ఆగస్ట్12 :


గోదావరి రివర్ మేనేజ్మెంట్ బోర్డు ఎజెండాపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఈ నెల 18వ తేదీన జీఆ రఎంబీ 18వ సమావేశం జరగనుంది. తెలంగాణ ప్రాజెక్టులపై మూడు అంశాలు అజెండాలో పెట్టడంపై అభ్యంతరం తెలిపింది. సమ్మక్క బ్యారేజీకి అనుమతులు నిలిపివేయాలనే అంశాన్ని తొలగించాలని కోరింది. తెలంగాణ ప్రాజెక్టుల టిఏసి అ నుమతుల వివరాల అంశం కూడా వద్దని తెలిపింది. సిడబ్ల్యూసి తదితర సంస్థలు ఇచ్చిన అనుమతుల సమీక్ష అం శంపైనా ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ అంశాలపై ఇప్పటికే జీఆర్ఎంబీలో విస్తృ తంగా చర్చించామని వెల్లడించింది. గతంలో ఏపీ అభ్యంతరాలను సిడబ్ల్యూసి పరిశీలించి తిరస్కరించిందని తెలంగాణ సర్కార్ వాదించింది. సిడబ్ల్యూసి అవార్డు, మార్గదర్శకాల ప్రకారమే ప్రాజెక్టులకు అనుమ తులు ఇచ్చినట్లు స్పష్టం చేసింది. మూడు అంశాలను అజెండా నుంచి డ్రాప్ చేయాలని జీఆర్ఎంబీకి తెలంగాణ సర్కార్ లేఖ రాసింది. సవరించిన అజెండా విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఇదిలావుంటే ఈ ఎజెండాపై వారం క్రితమే మాజీ మంత్రి హరీష్ రావు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అజెండా అంశాలను ఎలా అంగీకరిస్తారని ప్రశ్నించారు.

# విద్యుత్ ఉచ్చులో చిక్కుకుని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మృతి

- వన్యప్రాణుల వేటగాళ్లను పట్టుకునేందుకు వెళ్లి విషాదం..
- ఘటనపై సమగ్ర దర్యాప్తుకు మంత్రి కొండా సురేఖ ఆదేశం

ప్రభాత గమనం.వరంగల్ క్రైమ్ బ్యూరో

వన్యప్రాణుల వేట కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ ఉచ్చులో చిక్కుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చెరువుసింగారం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నవీన్ మృతి చెందడం పట్ల అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. జంతువులను వేటాడుతున్నారన్న సమాచారంతో అనుమానితులను పట్టుకునేందుకు మరో ముగ్గురు బీట్ ఆఫీసర్లతో కలిసి నవీన్ బూర్గంపాడు మండలం నకిరేపేట గ్రామానికి వెళ్లారు. విధి నిర్వహణలో భాగంగా అక్కడ ఏర్పాటు చేసిన విద్యుత్ ఉచ్చులో చిక్కుకుని తీవ్ర ప్రమాదానికి గురయ్యారు. వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్ సింగ్ మంత్రికి వివరించారు. ఈ ఘటనపై మంత్రి కొండా సురేఖ డీఎఫ్ఓతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వన్యప్రాణులు, అటవీ సంపద సంరక్షణలో అటవీ సిబ్బంది చేస్తున్న సేవలు అమూల్యమైనవని ఆమె అన్నారు. వన్యప్రాణుల వేట కోసం విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడం అత్యంత ప్రమాదకరమని, ఇలాంటి అక్రమ చర్యలతో వన్యప్రాణులతో పాటు అటవీ సిబ్బంది, స్థానిక ప్రజల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నవీన్ మృతికి కారణమైన ఘటనపై అటవీ, పోలీసు శాఖలు సమగ్ర దర్యాప్తు చేపట్టి, బాధ్యులను గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. మృతుడు నవీన్ కుటుంబానికి మంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. విధి నిర్వహణలో అటవీ సిబ్బంది భద్రతకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అటవీ శాఖ నిబంధనల ప్రకారం నవీన్ కుటుంబానికి ఎక్స్గ్రేషియా చెల్లించడంతో పాటు, కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం కల్పించేలా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని పీసీసీఎఫ్ వినయ్ కుమార్ను ఆదేశించారు.



P-03_Layout 2 12-Aug-26 11:33 PM Page 1





# ఎంజీఎం ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- జిల్లా కలెక్టర్ డా. సత్య శారద

వరంగల్ ఆగస్టు 12(ప్రభాత గమనం):

జిల్లా కలెక్టర్ డా. సత్య శారద బుధవారం ఎంజీఎం ఆస్పత్రిని సందర్శించి ఆస్పత్రిలోని కంప్లైంట్ బాక్స్‌ను పరిశీలించారు. అనంతరం వివిధ వార్డులను సందర్శించి రోగులతో నేరుగా మాట్లాడి వైద్యం అందుతున్న తీరుపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, సమస్యలపై వివరాలను తెలుసుకున్న కలెక్టర్ సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎంజీఎం డైట్ సెంటర్‌ను సందర్శించి అక్కడి పరిసరాలను పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రోగులకు అందించే డైట్ సెంటర్, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత ఇన్‌చార్జిలను ఆదేశించారు. ఈ సందర్భనలో ఎంజిఎం సూపరింటెంట్ డాక్టర్ రామ్ కుమార్,డాక్టర్ అశ్విన్ తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.




# ఫైళ్ల క్లియరెన్స్‌లో జాప్యం చేస్తే చర్యలు తప్పవు

- డబ్బులు ఇవ్వనిదే పనులు కావడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయి..
- ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలి
- గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్

ప్రభాత గమనం. వరంగల్ క్రైమ్ బ్యూరో

మున్సిపల్ కార్యాలయాల్లో ఫైళ్ల క్లియరెన్స్‌లో జాప్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ అధికారులను హెచ్చరించారు. ప్రజల నుంచి ఫైళ్ల పెండింగ్‌పై, డబ్బులు ఇవ్వనిదే పనులు జరగడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయని, ఇలాంటి ఫిర్యాదులు పునరావృతమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆస్తి పన్ను, నల్లా పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి, లక్ష్యాలను చేరుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కమిషనర్ స్పష్టం చేశారు. కార్యాలయాలకు వచ్చే ప్రజలతో వినయంగా, మర్యాదగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులు, ఫైళ్లను అనవసరంగా పెండింగ్‌లో పెట్టకుండా నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సూచించారు. ఫైళ్ల క్లియరెన్స్‌లో కావాలనే జాప్యం చేస్తున్నారనే ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజల నుంచి డబ్బులు తీసుకుని పనులు చేస్తున్నారనే ఆరోపణలకు తావివ్వకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలని అధికారులను హెచ్చరించారు. ప్రజలకు అందించాల్సిన సేవల్లో నిర్లక్ష్యం, జాప్యం లేదా అవినీతికి సంబంధించిన ఫిర్యాదులు మళ్లీ వస్తే సంబంధిత అధికారులు, సిబ్బందిపై నిబంధనల ప్రకారం శాఖాపరమైన చర్యలు తప్పవని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రజా సేవలో నిర్లక్ష్యానికి తావులేదు.. పారదర్శకతే లక్ష్యం అన్న విధంగా అధికారులు పనిచేయాలని ఆయన ఆదేశించారు.

# పన్నుల వసూళ్లకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలి

- ప్రతి ఇంటి నంబర్‌ను జియోట్యాగ్ చేయాలి...
- జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయ్...

హన్మకొండఆగస్టు 12(ప్రభాత గమనం):



గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని సాధించేలా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి, హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. నగరంలోని ప్రతి ఇంటి నంబర్‌ను జియోట్యాగ్ చేయడంతో పాటు కొత్త నిర్మాణాలు, ఆస్తుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పన్నుల పరిధిని విస్తరించాలని సూచించారు. బుధవారం హన్మకొండ ఐడీఓసీ కార్యాలయంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్నతో కలిసి ట్యాక్సేషన్, రెవెన్యూ అధికారులతో ప్రత్యేక అధికారి సమీక్ష నిర్వహించారు. సర్కిళ్ల వారీగా ఆస్తి పన్నుల వసూళ్లు, కొత్త నిర్మాణాల గుర్తింపు, ప్రభుత్వ భవనాల రీ–అసెస్‌మెంట్, కమర్షియల్, నాన్ కమర్షియల్ భవనాలకు పన్నుల విధింపు, ఆన్ కలెక్టబుల్ డిమాండ్లు, డబుల్ అసెస్‌మెంట్లు, వీఎల్‌టీ వసూళ్లు, ప్రాపర్టీ రివిజన్, డ్రోన్ సర్వే, జియోట్యాగింగ్ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ నగరంలోని ప్రతి ఇంటి నంబర్‌ను జియోట్యాగ్ చేసి, ఆస్తికి సంబంధించిన పూర్తి వివరాలను డిజిటల్ రికార్డులో అనుసంధానం చేయాలని ఆదేశించారు. డ్రోన్ సర్వే ద్వారా గుర్తించిన నిర్మాణాలు, ఆస్తుల వివరాలను క్షేత్రస్థాయి రికార్డులతో సరిపోల్చి, పన్ను పరిధిలోకి రాని భవనాలను గుర్తించాలని సూచించారు. ప్రాపర్టీ రివిజన్ ప్రక్రియను వేగవంతం చేసి, కొత్తగా ఏర్పడిన ఆస్తులు, నిర్మాణాల్లో వచ్చిన మార్పులను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. ప్రభుత్వ భవనాల అసెస్‌మెంట్లను కూడా నిబంధనల మేరకు పునఃపరిశీలించాలని, కమర్షియల్, నాన్ కమర్షియల్ భవనాలను స్పష్టంగా గుర్తించి సంబంధిత కేటగిరీ ప్రకారం పన్నులు విధించాలని సూచించారు. నిబంధనల ప్రకారం సెల్ టవర్లు ఉన్న భవనాలను కమర్షియల్ కేటగిరీ కింద పరిగణించి పన్నులు విధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒకే ఆస్తికి రెండు అసెస్‌మెంట్ నంబర్లు ఉన్న డబుల్ అసెస్‌మెంట్లను ప్రత్యేకంగా గుర్తించి, వాటి పూర్తి వివరాలను వారం రోజుల్లోగా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఆన్ కలెక్టబుల్ డిమాండ్లను క్షుణ్ణంగా పరిశీలించి, వసూలుకు అవకాశం ఉన్న బకాయిలపై నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. వసూలు కాని బకాయిలకు ఆర్ఆర్ చట్టం ప్రకారం నోటీసులు జారీ చేసి, తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. పన్నుల వసూళ్లలో వెనుకబడిన ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక బృందాలతో క్షేత్రస్థాయిలో పర్యటించాలని తెలిపారు. జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న మాట్లాడుతూ పన్నుల వసూళ్ల లక్ష్యాలను సర్కిల్, వార్డు స్థాయిలో విభజించి, రోజువారీ పురోగతిని పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. కొత్త అసెస్‌మెంట్లు, పెండింగ్ బకాయిలు, వీఎల్‌టీ, డబుల్ అసెస్‌మెంట్లు, కమర్షియల్ భవనాల గుర్తింపు వంటి అంశాలపై రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించాలని అన్నారు. ఆస్తుల జియోట్యాగింగ్, పన్నుల అసెస్‌మెంట్, వసూళ్ల ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. సమీక్షలో ఆదనపు కమిషనర్ జోనా, డిప్యూటీ కమిషనర్లు బిర్రు శ్రీనివాస్, ప్రసన్నారాణి, ట్యాక్సేషన్ అధికారి రామకృష్ణ, ఐటి మేనేజర్ రమేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

# కీర్తినగర్ లో మహిళా మృతదేహం లభ్యం

- ఆధార్ తో వెలుగులోకి వచ్చిన వివరాలు


ప్రభాత గమనం. వరంగల్ క్రైమ్ బ్యూరో

కీర్తినగర్‌లో మహిళ మృతదేహం వెలుగుచూడటం స్థానికంగా కలకలం రేపింది. కట్టమల్లన్న దేవాలయం సమీపంలోని ఓపెన్ ప్లాట్‌లో ఉన్న చిన్న గదిలో మృతదేహాన్ని గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉండటంతో కొన్నిరోజుల క్రితం ఆమె మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. సమాచారం అందుకున్న గీసుగొండ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. అక్కడ లభించిన ఆధార్ కార్డు ఆధారంగా మృతురాలిని నర్సంపేటకు చెందిన బూర రామగా గుర్తించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రామ గత కొంతకాలంగా మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ కారణంగా నర్సంపేట, చెన్నారావుపేటతో పాటు బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ ఉండేదని తెలిపారు. ఆమెను గతంలో కుటుంబ సభ్యులు నాలుగైదు సార్లు ఇంటికి తీసుకువచ్చినప్పటికీ.. కొంతకాలానికి మళ్లీ ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయేదని పేర్కొన్నారు. తల్లి మృతిపై తనకు ఎలాంటి అనుమానం లేదని మృతురాలి కుమారుడు సతీష్ పోలీసులకు లిఖితపూర్వకంగా తెలిపాడు. దీంతో అతని దరఖాస్తు ఆధారంగా గీసుగొండ పోలీసులు BNSS సెక్షన్ 194 కింద కేసు నమోదు చేశారు. మృతదేహానికి సంబంధించిన వైద్య, చట్టపరమైన ప్రక్రియలను పోలీసులు చేపట్టారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించే చర్యలు కొనసాగుతున్నాయి. ఘటనకు సంబంధించి పోలీసులు తదుపరి దర్యాప్తు చేస్తున్నారు.



# ఇనుగుర్తి గురుకులంలో మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ తనిఖీ

ఇనుగుర్తి,ఆగస్టు 12 (ప్రభాత గమనం ):



మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను మహబూబాబాద్ మాజీ శాసనసభ్యులు బానోత్ శంకర్ నాయక్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యతను ఆయన పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో నేరుగా ముచ్చటించి వారికి అందుతున్న విద్యాబోధన, ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ... సంక్షేమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యార్థుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. గురుకులంలో మౌలిక వసతుల మెరుగుదలకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ విజయ్, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పాక్స్) చైర్మన్లు దికొండ వెంకన్న, గుండా వెంకన్న, ముప్పారం సర్పంచ్ రాయిని శేఖర్, నాయకులు బొబ్బిలి మహేందర్ రెడ్డి, సుమన్ గౌడ్, నరసింహ నాయక్, బిక్కు నాయక్, మోహన్ నాయక్, ఇతర ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ఉన్నత పాఠశాలలో భరోసా- షీ టీం అవగాహన సదస్సు

ప్రభాత గమనం. వరంగల్ క్రైమ్ బ్యూరో



భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు భరోసా మరియు షీ టీం వారి ఆధ్వర్యంలో సింగరేణి ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం ఎస్సై స్వప్న కుమారి విద్యార్థినులకు గుడ్ టచ్–బ్యాడ్ టచ్, స్ట్రీట్ హరాస్మెంట్, మహిళలు మరియు విద్యార్థినుల భద్రత, సోషల్ మీడియా, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్, వీడియో కాల్స్‌కు స్పందించవద్దని, సోషల్ మీడియాను జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు. పాఠశాల పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, మహిళలు లేదా విద్యార్థినుల భద్రతకు సంబంధించిన సమస్యలు ఎదురైనా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 సేవలను వినియోగించుకోవాలని, సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళల పట్ల ఎవరైనా అసభ్యంగా లేదా అనుచితంగా ప్రవర్తించినట్లయితే ధైర్యంగా షీ టీంకు సమాచారం అందించాలని, షీ టీం మొబైల్ నంబర్ 8712658162కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచి, నేరస్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విద్యార్థినులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, తల్లిదండ్రులు తమ చదువు కోసం పడుతున్న కష్టాన్ని గుర్తించి చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఎస్సై స్వప్న కుమారి సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీం సిబ్బంది, భరోసా సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# యువత ఆరోగ్యమే సమాజానికి బలం

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఏ. అప్పయ్య
- హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై విస్తృత అవగాహన కార్యక్రమాలు ప్రారంభం

ప్రభాత గమనం. వరంగల్ క్రైమ్ బ్యూరో




అంతర్జాతీయ యువ దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ జిల్లాలో హెచ్ఐవీ/ఎయిడ్స్, ఎస్‌టీఐలపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలను బుధవారం ప్రారంభించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఏ. అప్పయ్య ప్రభుత్వ టీబీ ఆసుపత్రిలో ఇంటెన్సిఫైడ్ ఐఈసీ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డా. అప్పయ్య మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా యువతకు హెచ్ఐవీపై సరైన సమాచారం, అవసరమైన సేవలను డిజిటల్ వేదికల ద్వారా అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (నాకో) రూపొందించిన "బ్రేక్ ఫ్రీ యాప్" ద్వారా హెచ్ఐవీకి సంబంధించిన సమాచారం, సేవలను యువత సులభంగా పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా యాప్‌కు సంబంధించిన క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను అధికారులు, అతిథులు ఆవిష్కరించారు. అడిషనల్ డీఎంహెచ్ఓ డా. మదన్‌మోహన్‌రావు మాట్లాడుతూ ఆగస్టు 12 నుంచి అక్టోబర్ 12 వరకు జిల్లాలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 181 గ్రామాలతో పాటు పాఠశాలలు, కళాశాలలు, మహిళా సంఘాల్లో హెచ్ఐవీ/ ఎయిడ్స్‌పై అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర పాలక మండలి సభ్యులు, సామాజిక కార్యకర్త ఈ.వీ. శ్రీనివాసరావు మాట్లాడుతూ యువత హెచ్ఐవీ పట్ల సరైన అవగాహన పెంచుకోవాలని సూచించారు.

# రాంపురంలో ఆధ్యాత్మిక శోభ

- వైభవంగా ముత్యాలమ్మ తల్లి బోనాలు!
- అమ్మవారికి వెండి కిరీటాన్ని సమర్పించిన సర్పంచ్ దంపతులు
- భవానిల శివసత్తుల పూనకాలు..
- డప్పు చప్పుళ్లతో మారుమోగిన ఆలయ పరిసరాలు

గార్ల,ఆగస్టు 12 (ప్రభాత గమనం ):



గార్ల మండల పరిధిలోని రాంపురం గ్రామంలో గ్రామ ఆరాధ్య దైవం శ్రీ ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగ బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలు, సాంప్రదాయబద్ధంగా సాగింది. గ్రామంలో ఏటా నిర్వహించే ఈ ఉత్సవాల్లో భాగంగా ఈ ఏడాది కూడా పండుగ వాతావరణం సంతరించుకుంది.ఉదయం నుంచే గ్రామంలోని మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి, రంగు రంగుల ముగ్గులతో అలంకరించిన బోనాలను శిరస్సుపై ధరించారు. మేళతాళాలు, డప్పు చప్పుళ్ల మధ్య, భక్తుల జయజయధ్వానాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పసుపు, కుంకుమ, చీరసారెలు సమర్పించి తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు.ఈ వేడుకల సందర్భంగా రాంపురం గ్రామ సర్పంచ్ బాదావత్ సరోజినీ రవి నాయక్ దంపతులు అమ్మవారికి సుమారు రూ. 10,000 విలువైన వెండి ఆభరణాలతో ప్రత్యేకంగా తయారు చేయించిన 'వెండి కిరీటాన్ని' సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. అమ్మవారి దయాకటాక్షాలతో రాంపురం గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు.గ్రామంలోని ప్రతి కుటుంబం ఐక్యంగా ఈ బోనాల పండుగను జరుపుకోవడం ఇక్కడి ఆనవాయితీగా వస్తోందని గ్రామ పెద్దలు తెలిపారు. మహిళల బోనాలు, పోతురాజుల విన్యాసాలు, డప్పు కళాకారుల దరువులతో రాంపురం వీధులన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. భారీ సంఖ్యలో భక్తులు హాజరుకావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.ఈ వేడుకల్లో ఉప సర్పంచ్ సుంకిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ నవత సంతోష్ రెడ్డి, నాయకులు ఆడపు వెంకటేశ్వర్లు, గుండా వెంకట్ రెడ్డి, రేగళ్ల దామోదర్ రెడ్డి, కృష్ణారెడ్డి, ఎడపల్లి ఉపేందర్, పిడుగు సురేందర్, మారం సందీప్ రెడ్డి, జగదీష్, బోళ్ల ఉమా, సిరిమర్తి రాజేష్, రమణ, వెంకటమ్మ, ఉమా సుధాకర్ రెడ్డి, చంద్రకళ ఉపేందర్, సిరిమర్తి రవి, సిరిమర్తి వీరన్న, శ్రీను, గురువయ్యలతో పాటు గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

P-04_Layout 2 12-Aug-26 11:40 PM Page 1



# ప్రజా భద్రతకు మరింత పటిష్ట చర్యలు

- పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం
- నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించిన జిల్లా ఎస్పీ డా. శబరీష్



ప్రభాత గమనం. వరంగల్ క్రైమ్ బ్యూరో

మహబూబాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఆధ్వర్యంలో జిల్లా నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ల వారీగా నేరాల పరిస్థితి, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, పోలీస్ అధికారుల పని తీరును సమగ్రంగా సమీక్షించారు. గ్రేవ్ కేసులు, ప్రాపర్టీ నేరాలు, ఎస్సీ ఎస్టీ / కేసులు, మహిళలు మరియు చిన్నారులపై నేరాల దర్యాప్తును వేగవంతం చేసి పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. లిక్కర్, నల్లబెల్లం, అక్రమ పిడిఎస్ బియ్యం, అక్రమ ఇసుక రవాణా వంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. హిస్టరీ షీట్ల అప్‌డేట్, నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించారు. జిల్లాలో గుడుంబా తయారీ, విక్రయాలు మరియు అక్రమ రవాణాపై నిరంతరం ప్రత్యేక నిఘా కొనసాగించాలని ఎస్పీ ఆదేశించారు. గుడుంబా తయారీ కేంద్రాలు, అనుమానాస్పద ప్రాంతాలు, శివారు ప్రాంతాల్లో తరచూ సెర్చ్ ఆపరేషన్స్ నిర్వహించాలని సూచించారు. గుడుంబా తయారీకి వినియోగించే బెల్లం పాకం, నల్లబెల్లం, ఇతర ముడి పదార్థాలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, స్థానిక పోలీస్ సిబ్బంది, మరియు ఇతర సమాచార వనరుల ద్వారా పక్కా సమాచారం సేకరించాలని ఆదేశించారు. గుర్తించిన ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు, సెర్చ్ ఆపరేషన్స్ నిర్వహించి గుడుంబా తయారీని పూర్తిగా అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని, తయారీదారులు మరియు విక్రయదారులపై కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా మరియు సరఫరాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. అనుమానాస్పద ప్రాంతాలు, మాదకద్రవ్యాల వినియోగానికి అవకాశం ఉన్న ప్రదేశాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, NDPS కేసుల్లో సరఫరా గొలుసును గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాలు, ముఖ్యంగా ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, డిజిటల్ అరెస్టులు, పెట్టుబడి మోసాలు, ఓటీపీ / కేవైసీ మోసాలు, ఫేక్ లింకులు మరియు ఏఐ డీప్‌ఫేక్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ ఆదేశించారు. సైబర్ నేరాలపై ఫిర్యాదులు అందిన వెంటనే వేగంగా స్పందించి, బాధితుల నష్టాన్ని తగ్గించేలా తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. సైబర్ నేరాల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు అపరిచిత లింకులు క్లిక్ చేయకూడదని, ఓటీపీ లు, పిన్ లు, బ్యాంక్ వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ వెల్లడించకూడదని అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాలు మరియు ప్రజలు అధికంగా వచ్చే ప్రాంతాల్లో నిరంతరం సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో నేరాలు జరగకుండా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నైట్ పెట్రోలింగ్‌ను మరింత పటిష్టంగా నిర్వహించాలని ఎస్పీ సూచించారు. నేరాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలు, ప్రధాన రహదారులు, జనసంచారం తక్కువగా ఉండే ప్రాంతాలు, సున్నితమైన ప్రదేశాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పెట్రోలింగ్ సిబ్బంది నిర్దేశిత ప్రాంతాల్లో సమర్థవంతంగా గస్తీ నిర్వహిస్తూ, అనుమానాస్పద వ్యక్తులు మరియు వాహనాలను తనిఖీ చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# ఎంపీ వద్దిరాజు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తో భేటీ

న్యూఢిల్లీ ఆగస్టు12(ప్రభాత గమనం):



ప్రతిపాదిత నిజామాబాద్ రైల్వే బైపాస్ లైన్ (నిజామాబాద్, తెలంగాణ) మార్గాన్ని పునఃపరిశీలించాల్సిందిగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ను కోరారు.నిజామాబాద్ రూరల్ మండలం గుప్తాన్‌పల్లి, పాంగ్రా గ్రామాలలో చుట్టుపక్కల భూములను ప్రభావితం చేస్తూ నిజామాబాద్ పట్టణం వెలుపల భూసేకరణ ప్రక్రియలో ఉన్న ప్రతిపాదిత రైల్వే లైన్‌కు సంబంధించి మంత్రి అశ్వినీ వైష్ణవ్ ను ఢిల్లీలో బుధవారం సాయంత్రం ఎంపీ రవిచంద్ర కలిసి చర్చించారు. అభివృద్ధి చేయబడిన, ఆమోదించబడిన అశోక ఎన్‌క్లేవ్ ప్రాజెక్టులోని భూమి,ప్లాట్ల యజమానులు, చుట్టుపక్కల ఉన్న ప్రభావిత నివాసితులతో కలిసి, ప్రస్తుతం ప్రతిపాదించబడిన అలైన్‌మెంట్ వల్ల తలెత్తే ఆందోళనల గురించి ఎంపీ రవిచంద్ర ఆధ్వర్యాన బీఆర్ఎస్ నాయకులు మహేష్ బిగాల,అశోక్ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు అంజలి శంకర్ తదితరులు మంత్రికి వినతిపత్రాలు అందజేశారు. రాజ్యసభలో బీఆర్ఎస్ పక్ష మాజీ నేత కే.ఆర్.సురేష్ రెడ్డి,ప్రస్తుత నాయకులు రవిచంద్రలు రాసిన లేఖలను మహేష్,శంకర్ లు మంత్రికి అందించారు. మరిన్ని గ్రామాలకు రైలు అనుసంధానాన్ని మెరుగుపరిచే నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లిలో ప్రతిపాదిత విమానాశ్రయానికి ప్రవేశాన్ని సులభతరం చేసే అలైన్‌మెంట్ కోసం పునఃపరిశీలించాల్సిందిగా వారు కోరారు. ప్రభావిత భాగస్వాములు ప్రత్యామ్నాయ అనుసంధాన ట్రాక్ ఎంపికలను పరిశీలించాలన్నారు. ఆర్మూర్-మామిడిపల్లి స్టేషన్ నుండి డిచ్‌పల్లికి అనుసంధాన రైలు మార్గం, సుభాష్ ట్రాక్ గార్డెన్స్ ప్రాంతం నుండి డిచ్‌పల్లి వరకు అనుసంధానం గురించి ఎంపీ రవిచంద్ర మంత్రికి వివరించారు. ఈ ప్రత్యామ్నాయాలు, విస్తృత ప్రజా ప్రాంతానికి రైలు అనుసంధానాన్ని కల్పించడంతో పాటు, జాతీయ రహదారి కారిడార్ వెంబడి మెరుగైన వ్యాపార, వ్యవసాయ ఉత్పత్తులకు రవాణా సౌకర్యాన్ని మెరుగుపర్చవచ్చని వినతిపత్రంలో వారు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రతిపాదించబడిన అలైన్‌మెంట్‌ను ఉపసంహరించుకోవాల్సిందిగా, పునఃపరిశీలిన చేయాల్సిందిగా,ఆర్మూర్ నుండి డిచ్‌పల్లికి ప్రత్యామ్నాయ అనుసంధాన ట్రాక్ వైపు మార్చాలంటూ 14 తేదీన ప్రజాభిప్రాయాలు నమోదైన వివరాలను ఎంపీ వద్దిరాజు మంత్రి అశ్వినీ వైష్ణవ్ దృష్టికి తెచ్చారు. హైదరాబాద్‌కు ఇప్పటికే ఉన్న అభివృద్ధి చెందుతున్న రైలు అనుసంధానాన్ని దృష్టిలో ఉంచుకుంటే, ప్రస్తుత పరిస్థితులలో ప్రతిపాదిత బైపాస్ లైన్ తగినంత ప్రజా ప్రయోజనాన్ని చేకూర్చేలా కనిపించడం లేదని మహేష్, శంకర్ లు మంత్రికి చెప్పారు. సికింద్రాబాద్-హైదరాబాద్, నిర్మల్-ఆదిలాబాద్ వైపుకు అనుసంధానించే వాటితో సహా ప్రతిపాదించబడిన,అనుసంధానించబడిన కనెక్టివిటీ లైన్ మార్గం ఈ బైపాస్ అలైన్‌మెంట్ అవసరాన్ని తగ్గిస్తుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. నిజామాబాద్ వద్ద గూడ్స్ రైళ్ల రాకపోకలను జంకంపేట్ జంక్షన్‌కు మార్చడం జరిగిందని, అందువల్ల, ప్రతిపాదిత బైపాస్ లైన్ వాస్తవంగా ఉద్దేశించిన కార్యాచరణ ప్రయోజనం మరింత తగ్గిందన్నారు. ఆర్మూర్ నుండి డిచ్‌పల్లి వరకు రైలు మార్గాలను అనుసంధానించాలని ఆర్మూర్ ఎమ్మెల్యే కోరడం జరిగిందని చెప్పారు. దీనివల్ల ఇరవైకి పైగా గ్రామాలకు ప్రయోజనం చేకూరుతుందని, అలాగే ప్రతిపాదిత జక్రాన్‌పల్లి విమానాశ్రయానికి రాకపోకలు మెరుగుపడతాయని గతంలో పేర్కొన్న విధంగా ప్రతిపాదిత బైపాస్ అలైన్‌మెంట్ పునఃపరిశీలించి, ఉపసంహరించాల్సిందిగా కోరారు.ఇది గరిష్ట ప్రజా ప్రయోజనాలు, ఉద్దేశించిన కనెక్టివిటీ ఫలితాలకు ఉపయోగపడుతున్నట్లు కనిపించడం లేదని వినతిపత్రంలో వారు పేర్కొన్నారు. ఆర్మూర్ స్టేషన్ (లేదా ఆర్మూర్-మామిడిపల్లి) నుండి డిచ్‌పల్లి స్టేషన్‌కు ట్రాక్‌లను అనుసంధానించడం ద్వారా, లేదా మరిన్ని గ్రామాలకు మెరుగైన కనెక్టివిటీని, ప్రతిపాదిత విమానాశ్రయానికి మెరుగైన ప్రాప్యతను అందించే మరేదైనా అనువైన ప్రత్యామ్నాయ మార్గాన్ని పరిశీలించాల్సిందిగా ఎంపీ వద్దిరాజు మంత్రి అశ్వినీ వైష్ణవ్ కు విజ్ఞప్తి చేశారు.



## పారిశుద్ధ్య నిర్వహణకు యంత్రాల కొనుగోలు!

- సీజనల్ వ్యాధుల నివారణకు గార్ల మేజర్ పంచాయతీ ముందస్తు చర్యలు
- రెండు ఫాగింగ్ మిషన్లు, గ్రాస్ కట్టర్లతో సహా అత్యాధునిక పరికరాలు ప్రారంభం
- గ్రామ పరిశుభ్రతలో ప్రజలు భాగస్వాములు కావాలి : సర్పంచ్ పార్వతి హతిరాం నాయక్

గార్ల, ఆగస్టు 12 (ప్రభాత గమనం):

వర్షాకాలం నేపథ్యంలో గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గార్ల మేజర్ గ్రామపంచాయతీ పాలకవర్గం ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టింది. పారిశుద్ధ్య నిర్వహణ, దోమల నివారణ, పచ్చదనం పరిరక్షణ లక్ష్యంగా పంచాయతీ నిధులతో కొనుగోలు చేసిన పలు అత్యాధునిక పరికరాలను బుధవారం పంచాయతీ ఆవరణలో సర్పంచ్ పార్వతి హతిరాం నాయక్ అధికారికంగా ప్రారంభించారు.పారిశుద్ధ్య పనులను వేగవంతం చేసేందుకు మరియు దోమల తీవ్రతను అరికట్టేందుకు పంచాయతీ ప్రత్యేక శ్రద్ధ వహించింది.2 ఫాగింగ్ మిషన్లు, 2 తైవాన్ పవర్ స్ప్రేయర్ పంపులు, 2 గ్రాస్ కటింగ్ మిషన్లు (గడ్డి తొలగింపునకు), 2 కొమ్మలు కటింగ్ మిషన్లు, 2 గార్డెన్ కత్తెరలు, 16 కొత్త డస్ట్‌బిన్లు అందుబాటులోకి తెచ్చారు. వీటితో పాటు గ్రామ వీధుల్లో అవసరమైన చోట కొత్త వీధిలైట్ల ఏర్పాటు, మురుగునీటి కాల్వల వద్ద బ్లీచింగ్ పౌడర్ పిచికారీ పనులను కూడా ముమ్మరం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ పార్వతి హతిరాం నాయక్ మాట్లాడుతూ, "వర్షాకాలంలో దోమల వ్యాప్తి చెందకుండా క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహిస్తాం. ఈ నూతన పరికరాలతో పారిశుద్ధ్య పనులు మరింత వేగవంతం అవుతాయి. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, గ్రామ పరిశుభ్రతను కాపాడటంలో పంచాయతీ సిబ్బందికి సహకరించాలి" అని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎండీ జరీనా బేగం, వార్డు సభ్యులు తోడేటి శ్రీనివాస్, ఎండీ రహీం ఖాన్, పంచాయతీ సిబ్బంది సుధాకర్, సైజాద్, శ్రీనివాసరావు, దాసు, వెంకన్న, బాబు తదితరులు పాల్గొన్నారు.

## పాఖాల సమీపంలో అరుదైన పాము

వరంగల్ బ్యూరో ఆగస్టు 12(ప్రభాత గమనం):



ఖానాపురం మండలం అశోక్ నగర్ (పాకాల) సమీపంలో అరుదైన, అత్యంత విషపూరితమైన 'బ్యాండెడ్ క్రైట్' పాము ప్రత్యక్షమైంది. శరీరమంతా నలుపు, పసుపు రంగు చారలతో ఉన్న ఈ సర్పం స్థానికుల కంట పడింది. సమాచారం అందుకున్న గ్రామానికి చెందిన శ్రీకాంత్, శ్రవణ్, నవీన్, ప్రకాష్ అనే యువకులు ఎంతో చాకచక్యంగా వ్యవహరించారు. పాముకు గానీ, ఎవరికీ గానీ ఎలాంటి హాని కలగకుండా దానిని సురక్షితంగా పట్టుకుని, వెంటనే పాకాల అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎఫ్ఎస్ఓ ధర్మ, జయప్రకాష్, విజయ్, రాజు, మహేష్లతో కూడిన అటవీ సిబ్బంది అక్కడికి చేరుకుని పామును ఆధీనంలోకి తీసుకున్నారు. అనంతరం దానిని పాకాల అభయారణ్యంలోకి తీసుకెళ్లి సురక్షితంగా విడిచిపెట్టారు. పామును చాకచక్యంగా పట్టుకుని అటవీశాఖకు అప్పగించిన స్థానిక యువకులను అటవీ అధికారులు అభినందించారు.

## కేసముద్రంలో ఘనంగా

# 'హర్ ఘర్ తిరంగా'

- 75 మీటర్ల భారీ జాతీయ జెండాతో వీధుల్లో హోరెత్తిన దేశభక్తి
- ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు

కేసముద్రం, ఆగస్టు 12(ప్రభాత గమనం):

భారతదేశం 80వ స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలకు సిద్ధమవుతున్న వేళ, 'వందేమాతరం' గేయం రూపుదిద్దుకుని 150 వసంతాలు పూర్తయిన చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని కేసముద్రంలో 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ అత్యంత వైభవంగా సాగింది. ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు కేసముద్రం మండల పరిధిలో బుధవారం కన్నులపండువగా నిర్వహించిన ఈ 'తిరంగా యాత్ర' స్థానికుల్లో అమితమైన దేశభక్తి స్ఫూర్తిని నింపింది.బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పునూతుల రమేష్ మరియు సీనియర్ నాయకుల నాయకత్వంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల ప్రాంగణం నుంచి ఈ ర్యాలీ ఘనంగా ప్రారంభమైంది. అక్కడ నుంచి ప్రారంభమైన ప్రదర్శన గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజ్, ప్రభుత్వ హైస్కూల్ మీదుగా మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. విద్యార్థులు, యువకులు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని దేశభక్తి నినాదాలు, వందేమాతర ఆలాపనలతో కేసముద్రం వీధులను హోరెత్తించారు.ఈ ర్యాలీలో 75 మీటర్ల పొడవైన సుదీర్ఘ జాతీయ జెండా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు, యువత శ్రేణులు ఎంతో ఉత్సాహంగా ఈ భారీ పతాకాన్ని చేతబూని ప్రదర్శిస్తూ ముందుకు సాగడం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమర యోధుల అసమాన త్యాగాలను స్మరించుకోవడానికి, పౌరులందరిలో దేశభక్తి భావాన్ని పెంపొందించడానికి ప్రధాని మోడీ ఈ తిరంగా యాత్రకు పిలుపునిచ్చారని పేర్కొన్నారు. 80 ఏళ్ల స్వతంత్ర భారత స్ఫూర్తిని, 150 ఏళ్ల 'వందేమాతర' అమర సందేశాన్ని చాటుతూ కేసముద్రం వీధుల్లో సాగిన ఈ 75 మీటర్ల పతాక ప్రదర్శన ప్రజాబాహుళ్యంలో గొప్ప చైతన్యాన్ని నింపిందని కొనియాడారు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచే మన మువ్వన్నెల జెండా నీడలో దేశ ప్రజలంతా ఏకతాటిపైకి రావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ వేడుకల్లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, మండల కన్వీనర్ గడ్డం అశోక్, 'హర్ ఘర్ తిరంగా' జిల్లా కన్వీనర్ ధార హిందూ భారతి, జిల్లా ఉపాధ్యక్షుడు పొదిల నరసింహారెడ్డి, జిల్లా సీనియర్ నాయకుడు ఓలం శ్రీనివాస్, మున్సిపాలిటీ కన్వీనర్ బోగోజు నాగేశ్వర చారి ప్రముఖంగా పాల్గొన్నారు. వీరితో పాటు పార్టీ నాయకులు లెంకలపల్లి శ్రీనివాస్, బచ్చు లక్ష్మీ నారాయణ, ఐత సారయ్య, పూర్ణకంటి భాస్కర్, వెలిశాల సవీన్, భూక్య విజయ్, చంద్రకళ, గాంతి వెంకట్ రెడ్డి, బానోతు రాము, జుజ్జూరు వీరభద్ర చారి, బానోతు రమేష్, సంపత్, చలగోల వెంకటేష్, మూడవత్ అశోక్, వాంగుడోత్ నరేష్, వెలుపుల ఐలయ్య, అనిల్, కుమార్, బానోత్ సురేందర్, వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు మరియు స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు.



Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374